నిరక్షరాస్యులూ, అసంస్కారులూ, కుసంస్కారులూ, వీళ్లు మీ ఆయువుపట్టు! జనాలు అట్లా ఉండటమే వాళ్లని అట్లా ఉంచటమే మీకు ఆనందం, అవసరం కూడా!... మీ ఈ పాలసీని మేము ఆమోదిస్తే మేము- అంటే ఈ వార్డు వాళ్లం- అందరమూ మీకు మంచి వాళ్లం! లేకపోతే మీకు విరోధులం! అభివృద్ధి నిరోధకులం! బడుగువర్గాల కడుపు కొట్టేవాళ్లం! అంతే కదూ!... అయినా సరే, వెళ్ళండి బాబూ వెళ్ళండి,వెళ్ళి ఇంకో వార్డులో నుంచోండి అక్కడ గుమ్మాల్లో అడుక్కోండి. మాకా హామీ ఇచ్చేదాకా మా గుమ్మా లెక్కకండి!''

(క్రోక్విల్ హాస్యప్రియ నవంబర్ 86.)

★★★ ★★★ ★★★

# లారీలో ఏముంది?

డిసెంబరు నెలలో ఒక ఉదయం వేళ సుమారుగా ఎనిమిది గంటలవుతోంది. చిరు చలితెరలు వాతావరణాన్ని ఇంకా వదల్లేదు.

ఉప్పల్ హైవే నంబర్ ఫైవ్‌లో, లోడ్‌తో ఉన్న ఒక లారీ, బరంపురం నుంచి వస్తూ ఇచ్ఛాపురం వైపు...( ఆంధ్రప్రదేశ్‌లో) ఉన్న ఆంధ్రచెక్ పోస్ట్ గేటు దగ్గరకు వచ్చి, అంతకుముందే అక్కడ ఆగి ఉన్న పెట్రోలు టాంకర్ వెనకాల ఆగింది. లారీ కాబినులోంచి పుస్తకంతో డ్రైవరు దిగాడు. వేగంగా పాకలోకి వెళ్ళి చెకింగు గుమాస్తా బల్లమీద పుస్తకం పడేసి నుంచున్నాడు.

చెకింగు గుమాస్తా తన మఫ్లరును సరిచేసుకుని, తాపీగా సిగరెట్టు తీసి అంటించుకుని, డ్రైవరు వైపు చూస్తూ అడిగాడు.

'' ఎక్కడ్నుంచేటి?''

డ్రైవరు చాలా టూకీగా సమాధానం చెప్పాడు.''బరంపురం''

''లోడేటి?'.. '' సోప్ పౌడరు''.. '' ఎంత లోడు?'' ... '' వే బిల్లులో ఉంది.'' కట్టె విరిచినట్టు వేగంగా వస్తున్న సమాధానాల్ని చూసి గుమాస్తా డ్రైవరు ముఖంలోకి పరిశీలనగా చూశాడు. డ్రైవరుకు పాతికేళ్లకంటే ఎక్కువ వయస్సుండదు. వదులు కాకి పాంటూ, వదులు కాకి చొక్కా, నెత్తిన తిరపతి టోపీ. వీటితో అతను కొంచెం చిత్రంగా ఉన్నాడు. రంగు చామన ఛాయ.

గుమాస్తా రోడ్ వైపు చూస్తూ, ' అరే పట్నాయక్, చీకుతో లోడ్ చెక్ చెయ్యరా '' అన్నాడు. ('చీకు'- ఇంగ్లీషు సీకర్' ఒక కొన సూదిగా ఉంటూ, సుమారు గజమున్నర పొడుగు ఉండే ఇనుప గొట్టం)

రోడ్డు మీద, చీకు మీద గడ్డంఆనించినుంచొన్న ఆ పట్నాయక్ అన్నవాడు '' యస్‌సార్'' అంటూ నడిచి, లారీ ఎక్కి దాని మీద కప్పిన టార్పాలిన్ ను ఒక పక్కన వూడ దీసి లోపలికి చూశాడు అన్నీ దేవదారు చెక్కకేసులే.

వాడు తన 'చీకు' తో పొడుస్తూ అంతటాపరీక్షిస్తున్నాడు. క్లీనరు కూడా కిందికి దిగాడు చేతులు కట్టుకుని కాబిన్‌ను ఆనుకుని నిలుచుని పాక వైపు చూస్తున్నాడు. అతను కూడా వదులు కాకీ పాంటే

వేసుకున్నాడు కాని చొక్కా మాత్రం మాసిన తెలుపు అతనిక్కూడా నెత్తిన తిరపతి టోపి ఉంది. వయసు ఇరవై ఏళ్ళుండవచ్చు. మొహం డ్రైవరు మొహం కన్నా సంస్కారవంతంగా ఉంది.

చెక్కింగు పూర్తి చేసుకుని పట్నాయక్ కిందికి దిగగానే క్లీనర్, వూడిపోయిన టార్పాలిను తాళ్ళను మళ్ళీ మామూలుగా హుక్కులకు కట్టడంలో నిమగ్నమయ్యాడు. పట్నాయక్ పాకలో కొచ్చి గుమాస్తాతో, “ కుచ్‌బీనహి సాబ్” అన్నాడు.

పాకలో అంతవరకు వే బిల్లును పరిశీలిస్తున్న గుమాస్తా తలెత్తి బండి దగ్గరున్న క్లీనరు పడుతున్న అవస్థ చూసి “ ఏంట్రా పట్నాయక్, యీల్లకి జబ్బల్లో కండ లేదు. మీసాలు గడ్డాలు మొలవలేదు. అసలీల్లకి డ్రైవింగు లైసెన్సులున్నయంటవూ?”అన్నాడు.

పట్నాయక్ మృదువుగా నవ్వాడు కాని, టేబిలు దగ్గిర నుంచున్న డ్రైవరు చురుగ్గా చూశాడు గుమాస్తావైపు. అతని ముఖంలో ఆతృత వ్యక్త మయింది

రోడ్డుమీదున్న పెట్రోల్ టాంకర్ స్టార్ట్ అయింది. దానికి తోవ ఇవ్వటం కోసం గేటు గార్డుగేటు ఎత్తాడు.

డ్రైవరు హటాత్తుగా గుమాస్తా చేతిలోంచి వే బిల్ బుక్‌ను ఇంచుమించు బలవంతంగా లాగేసుకుని వేగంగా తన లారీ దగ్గరకు పరుగెత్తాడు. డ్రైవరూ, క్లీనరూ చటక్కునలోపలికి ఎక్కారు. రెప్పపాటు కాలంలో - గేటు ఎత్తి ఉండగానే - పెట్రోల్ టాంకు వెనకాలే- ఈ లారీ కూడా గేటు దాటేసింది! రెండో క్షణంలో టాంకరును దాటేసి ముందుకు దూసుకు పోయింది

గుమాస్తా తెల్లబోయాడు. హడావుడిగా లేచి బయటికి పరుగెత్తాడు. “ లంజాకొడుకులు.గంజాయి ఆకో, గన్సో దాటించేస్తున్నార్రా. నక్సలైట్లో ఏటో! నా కసలికి అల్లద్దరినీ సూసిన కాన్నుంచీ డవుట్ పుడతానే ఉంది ఏరా ఫూల్, బాడీ అంతా సరింగా చెక్ సేసినావా?”

పట్నాయక్ కంగారుగా “ హాహా సాబ్ అవన్నీ సోపు కేసులేసార్ ” అన్నాడు. రెండు మూడు నిముషాలు గడిచాయి. గుమాస్తా అందర్నీ వరుసబెట్టి తిడుతున్నాడు. ఇంతలో బరంపురం వైపు నుంచి ఇంకో లారీ వచ్చి ఆగింది. గుమాస్తా ఆ లారీ వేబిల్లు మీద సంతకం చేసి డ్రైవరుతో “ ఏ.ఏ.ఒ. ఎనిమిదీ డెబ్బై ఎనిమిది బండి తప్పించుకుని పారెళ్ళి పోనాడు. అన్ని చేక్ చెయ్యి. గంజాయి దాటేస్తున్నాడు. ఇచ్ఛాపురం సమితి ఆఫీసుల సి.టి.వో.గారున్నడా. అయన్తో సెప్పి ఎల్లిపో. నాకు నువ్వు మామూలియ్యొద్దులే’ అన్నాడు మరుక్షణంలో ఈ లారీ బ్రహ్మాండమైన వేగం అందుకుంది.

★ ★ ★

ఈ లారీ వాడు రెండున్నర మైళ్ళు ప్రయాణం చేసి మొదటి ఆంధ్ర గ్రామం ఇచ్ఛాపురం చేరి అక్కడి సిటివోకి విషయ చెప్పి తన దోవన తాను వెళ్ళిపోయాడు.

ఇంక సి.టి.వో దెబ్బ తిన్న పులిలాగా విజృంభించాడు. అక్కడి నుంచే ఇచ్ఛాపురం పోలీస్ స్టేషన్‌కు ముందుగా ఫోన్ చేసి, తర్వాత తను వెళ్ళి యస్.ఐ కి తెలిపాడు. ఇద్దరూ హడావుడిగా సెంటరుకు వచ్చేటప్పటికి, అప్పటికి పావు గంట క్రితమే ఆలారీ దూసుకు పోయిందని అక్కడున్న జూనియర్ కాలేజి కుర్రాళ్ళు చెప్పారు ఆలారీ సోంపేటకు వెళ్ళే లోపల అటు రాజపురం వైపు గాని, ఇటు జరడావైపు గాని

మళ్ళీ ఆస్కారం లేదని తీర్మానించుకుని, ఇద్దరూ హడావిడిగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. యస్.ఐ. సోంపేట ఎస్.ఐ. కు వైర్‌లెస్ మెసేజ్ పంపించాడు.

ఈ సమయానికి తప్పించుకుపోయిన ఏ.ఏ ఓ. ఎనిమిదీ డెబ్భై ఎనిమిదీ లారీ, ఇచ్ఛాపురానికి ఎనిమిది మైళ్ళ దూరంలో ఉన్న జాడుపూడిని దాటేసింది. సోంపేట రైల్వే స్టేషన్ వైపు శరవేగంతో వెళ్ళిపోతూంది.

★ ★ ★

సోంపేట పోలీస్ స్టేసన్లో మెసేజ్ అందుకున్న అక్కడి యస్.ఐ. హడావుడిగా బయల్దేరి, ఏ.ఎస్.ఐ.ను, నలుగురు కానిస్టేబిల్సునూ వాన్‌లో ఎక్కించుకుని, రెండున్నర మైళ్ళ ప్రయాణం తర్వాత సోంపేట స్టేషన్ దగ్గరున్న లెవెల్ క్రాసింగ్ చేరాడు. కొంతతర్జన భర్జన అయిం తర్వాత వాళ్లు తమ వాన్‌ను లెవెల్ క్రాసింగ్‌కు అడ్డం పెట్టారు. వూళ్లోకొచ్చే రోడ్డుకు ( తాము ఇపుడు ప్రయాణం చేసిన రోడ్డుకు) అడ్డంగా ఆ బలగమంతా నిలబడ్డారు. ఎస్.ఐ. తన వాచీ చూసుకున్నాడు. ఎనిమిదీ ఇరవై.

హఠాత్తుగా దూరం నుంచి అమిత వేగంగా వస్తూన్న లారీ యస్.ఐ. కంట బడింది. అతను తన బలగాన్ని హెచ్చరిస్తూ " ఎలర్ట్" అన్నాడు. లారీ రోడ్డు చీలికను సమీపించింది. డ్రైవర్ కళ్ళు లెవెల్ క్రాసింగ్ వైపు ఉన్నాయి. లారీ వేగం కొద్దిగా తగ్గినట్టు తగ్గింది. మరుక్షణంలో రెట్టింపయింది. లెవల్ క్రాసింగ్ వైపు తిరక్కుండా లారీ తిన్నగా సర్రున దూసుకు వచ్చింది. ఒక్కమాటుగా దానికి దోవ ఇస్తూ పోలీసులు రోడ్డుకు అటూ ఇటూ పరుగెత్తారు. ఒకళ్లిద్దరు కింద పడ్డారు. వాళ్ళులేచి, దులుపుకుని చూసేటప్పటికి, లారీ రెండు ఫర్లాంగుల దూరంలో టర్నింగ్ తిరుగుతూ కనుపించింది. ఎస్.ఐ. కళ్ళు చింత నిప్పులయ్యాయి. గర్జిస్తూ అన్నాడు. " మర్డర్ అటెంప్ట్ చేస్తాడా, ల్లంజాకొడుకు. వీడి తోలు తియ్యాలివ్వాల" మరుక్షణంలో పోలీసువాను పోలీసు బలగంతో లారీని వెంబడిస్తూ మళ్ళీ సోంపేట వూర్లోకి వస్తూంది. ఎస్.ఐ. కోపాన్ని పెంచడానికా అన్నట్టు వాను కాలేజీ బిల్డింగు దగ్గరకు వచ్చేటప్పటికి, అప్పుడే రోడ్డెక్కిన కర్ర పెండలం బళ్ళు నాలుగు వానుకు ఎదురొచ్చాయి. అక్కడే కల్వర్టు. సైడుకి దిగడానికి వీల్లేకుండా పక్కనే చెరువు. వాను ఆగక తప్పలేదు. రెండు నిముషాల తర్వాత అదిమళ్ళీ బయలుదేరింది.

పోలీస్ స్టేషన్ దగ్గర ఎ.ఎస్.ఐ. ను దించివేస్తూ అన్నాడు ఎస్.ఐ. " ముందుకు పలాసకు, మందసాకు, వెనక్కు ఇచ్ఛపురానికి మెసేజస్ కొట్టు. నువ్వు ఇక్కడే ఉండు. నేను ఆ రాస్కెల్‌ను ఛేజ్ చేస్తాను. " వెంటనే వాన్ బయలుదేరింది.

అప్పటికే లారీ వూరు దాటుకుని వెళ్లిపోయి, మూడు మైళ్ళు అవతల పరుగు తీస్తూంది.

★ ★ ★

బారువ టర్నింగ్ దగ్గరకొచ్చింది లారీ. స్‌స్‌స్‌....! బారువ వైపు మలుపు తిరక్కుండా హఠాత్తుగా కుడివైపు తిరిగి రయ్యమని పరుగెత్తింది. దానిక్కారణం, బహుశా దూరాన ఉన్న బారువ గ్రామంలోకి వెడితే ఆ పైన వెళ్ళేందుకు సముద్రమే ఉందన్న దృష్టి డ్రైవరుకి ఉండడం అవ్వవచ్చు. లేదా అనాలోచనన్నా అయి ఉండాలి. లారీ, నాలుగు మైళ్ళు ప్రయాణం తర్వాత బారులెవల్ క్రాసింగు ను దాటి ఇందాకటి

నేషనల్ హైవేలో ప్రవేశించి పలాసవైపు దూసుకుపోతూంది. ఈలోగా ఒక కోడి చక్రాల కిందపడి పచ్చడైపోయింది.

మళ్ళీ లెవల్ క్రాసింగు దాటింది లారీ. ఎయిర్ హారన్ మీద నుంచి డ్రైవర్ చెయ్యి తీస్తున్నట్టులేదు. అది చెవులు చిల్లుల పడేలాగా ఏక మోతగా మోగుతుంది. రెండు ఫర్లాంగులు ముందుగా వెడుతున్న చెరుకుబళ్ళవాళ్ళు హడావుడిగా కిందకు దూకి, బళ్లను రోడ్డు పక్కకు బలవంతంగా మళ్లిస్తున్నారు. అక్కడికీ లారీ అదురుడికి ఒక బండి ఎడ్లు బెదిరి, బండిని పక్కకి కందకంలోకి ఈడ్చేసాయి.

★ ★ ★

మహేంద్ర తనయ నదిని దాటింది లారీ. శాసనాం దగ్గర కుడివైపుకు మలుపు తిరిగి ఉంటే మందసా మీదుగా అది పర్లాకిమిడి వెళ్ళేదే. బహుశా దానికథ కూడా ఇక్కడితో ఆగిపోయి ఉండేదేమో. అట్లా కాకుండా అది తిన్నగానే పరుగెత్తింది. మళ్లీ ఎదురొచ్చిన ఎస్.ఆర్.ఎమ్.టి. వాళ్ల ఎక్స్‌ప్రెస్ బస్సు, రెండు మూడు ట్రక్కులు ఇంచుమించుగా ప్రమాదం నుంచి బయటపడి తప్పించుకుని వెళ్ళిపోయాయి.

సోంపేట నుంచి మెస్సేజి వచ్చే సమయానికి పలాసా పోలీస్ స్టేషన్లో వైర్‌లస్ ఆపరేటరూ, గార్డుతప్ప ఇంకెవ్వరూ లేరు. ఎస్.ఐ అసలు వూర్లోనే లేడు. వైర్‌లెస్ ఆపరేటరు పరుగెత్తుకుంటూ వెళ్ళి నిద్ర పోతున్న ఏ.ఎస్.ఐ. ను లేపి మెసేజ్ చెప్పాడు. అతగాడు ఇంకో ఇద్దరు కానిస్టేబిల్స్‌ను నిద్రలోంచి లేపించాడు. ఇంత హడావుడీ జరిగి వాళ్లందరూ రోడ్డు మీదకి వచ్చారో లేదో వాళ్ళ కళ్ళముందునంచే లారీ సర్రున దూపుకు పోయింది. ఆ విసురుకి రోడ్డు వూడుస్తున్న ఇద్దరు స్కావెంజర్లు పక్కకు అదిరిపడి తను కర్రలు విరగొట్టుకున్నారు.

ఆదరాబాదరా ఏ.ఎస్.ఐ. తన స్టేషన్‌కు పరుగెత్తాడు. జరిగిన విషయాన్ని ముందుగా నౌవడా, టెక్కలి, మెలియపుట్టిలకు వెనక్కు సోంపేటకు పంపించాడు.

★ ★ ★

లారీ పూండి లెవల్ క్రాసింగును చేరింది. రోడ్డు అక్కడ మళ్లీ మూడు రకాలుగా చీలింది. ఎందకనోగాని డ్రైవరు రొసిడా, టెక్కలి వెళ్ళే రెండు తిన్నని మార్గాల్ని వదిలి, కుడివైపుకు మిలియాపట్టికి మార్గం పట్టి పన్నెండు మైళ్ళు ప్రయాణానికి సిద్ధపడ్డాడు. అక్కడ లెవల్ క్రాసింగును దాటుతున్నప్పుడు లారీ వేగానికి, లారీ లోపల ఎగిరి పడిన చెక్క పెట్టెల చప్పుడుకు గేట్ మాన్ నివ్వెరపోయి చూస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత ఒక చోట నెత్తిన చోడిగడ్డి మోపుతో వస్తున్న ఒక ఆడమనిషి గబగబా పక్కకు తప్పుకోబోయి గడ్డిమోపు కింద పడగా, పక్కనున్న తన కొడుకుతో " ఏట్రా ఇది, ఈడి ఒల్లుకు వూప్షం గానెక్కిసినాదేంటి, ఎద్దుచ్చనాగ జయ్ మని పారెల్లి పోయొచ్చేత్తున్నాడు. ?" అంది.

ఇంతవరకూ జరిగిన ముప్పై మైళ్ళు ప్రయాణంలోనూ డ్రైవరుకు బాగా అనుకూలించిన అంశమేమిటంటే ఆ ఐదు లెవెల్ క్రాసింగుల దగ్గరా ఏ గేటు వేసి ఉండకపోవటం!

★ ★ ★

మెలియాపుట్టి అనేది ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గ్రామం. ఆ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. అయిన సూకరాజు కొంతకాలం సైన్యంలో పనిచేసి వచ్చినవాడు. అతన్లో జీర్ణించుకు

పోయిన అంతులేని గుండె ధైర్యం కర్తవ్య పరాయణతలను చూసి అతని సాటివాళ్లు ఈర్ష్య పడుతుంటారు ఒకప్పుడు మహేంద్ర పర్వతం దిగువన ఉన్న గొప్పిలి, గొకర్ణపురం , భోగాపురం వగైరా ఆంధ్ర గ్రామాల్లో భయోత్పాతన్ని సృష్టించిన ఒక చిరుతను ఒంటరిగా చంప కలిగినందుకు అతనికి ప్రభుత్వం ప్రత్యేక బంగారు పతకాన్ని ఇచ్చింది కూడా.

పలాసా నుంచి మెసేజు అందగానే నూకరాజు స్టేషన్లో కాళీగా పడి ఉన్న ఇనుప కమ్మీలు నాలుగింటిని గబగబ, స్టేషనుకు ఎదురుగా రోడ్డుకు అడ్డంగా పేర్పించాడు. స్టేషన్ల ఉన్న కానిస్టేబుల్స్ అందర్నీ గన్‌తో సిద్ధంగా గుమ్మంలో నుంచుని ఉండమన్నాడు. తాను ఏ.ఎస్ ఐ. తో బాటు రివాల్వర్ లోడ్ చేసుకున్నాడు. ఇద్దరూ, కలిసి లారీ వస్తున్న దిక్కులో అర ఫర్లాంగు దూరం నడిచి, రోడ్డుకు చెరొక వైపుకు తప్పుకున్నారు. కొత్తగా నాటిన గానుగ మొక్కలకు మేసిన కంచె మాటున 'పొజిషన్' తీసుకొన్నాడు ఎస్ ఐ. తన వాచీ చూసుకున్నాడు. తొమ్మిది

పదినిమిషాలు గడిచాయి.ఎస్.ఐ. అసహనంగా తన జేబులో నుంచి సిగరెట్ పాకెట్ తియ్యబొయ్యాడు. దూరంగా హఠాత్తుగా టర్నింగు తిరిగిన లారీ కనిపించింది. సిగరెట్ పాకెట్ అమాంతం ఎటో ఎగిరి పోయింది. అతని వేళ్ళు రివాల్వరు ట్రిగ్గర్ మీద క్రమంగా బిగుసుకుంటున్నాయి.

పది పన్నెండు పదిహేను పద్దెనిమిది... సెకన్లు గడుస్తున్నాయి. లారీ వచ్చేస్తూంది. ఎస్.ఐ. దాని నెంబరు గుర్తు పట్టాడు. వెంటనే గావు కేక పెట్టాడు. " రెడీ ఒన్ టూ త్రీ ఫైర్!"

రెండు ఆయుధాల శబ్దాలూ ఏకమై ఒకే శబ్దంగా పెద్దగా ధన్ మని గాలిలో ప్రతి ధ్వనించాయి.

ఆయుధాలే ముందర పేలాయో టైర్లే ముందర బద్దలయ్యాయో తెలియనంత వేగంగా ముందు చక్రాల్లోని గాలి 'సస్స్' మన్న శబ్దంతో పోగా, లారీ ఒక్క కుదుపుతో నేలకు కరచుకుపోయింది. 'కీచు' మని శబ్దం చేస్తూ లారీ పదిగజాల ముందుకు వచ్చి ఆగిపోయింది.

శరవేగంతో దూసుకు వెళ్ళారు ఇన్‌స్పెక్టర్లిద్దరూ. 'హాండ్సప్' అన్నాడు ఎస్.ఐ. కిందికి దిగిన డ్రైవరూ, క్లీనరును చుట్టు ముట్టి వాళ్ళను నడిపించుకుంటూ స్టేషన్లోకి తీసుకొచ్చారు ఇద్దరూ కలిసి. ఒక కానిస్టేబిల్ వాళ్లిద్దరి జేబులూ తడిమి వాళ్ల దగ్గర ఆయుధాలేవీ లేవని నిర్ధారణ చేసిన తర్వాత వాళ్ల చేతులు వెనక్కు విరిచి కట్టించి బేడీలు వేయించాడు యస్.ఐ.

★ ★ ★

మనిషికి ఉండగలిగినంత భయమూ, ఆదుర్దా ,కంగారూ, అసహనమూ, నిస్సహాయతా, కోపమూ వగైరాలు ఆ డ్రైవర్లూ , క్లీనర్లు మొహాల్లో చోటు చేసుకున్నాయి. చిరుచలిలో కూడా వాళ్ల కాలర్లు చెమటతో తడిసి పోయి ఉన్నాయి, ఎత్తుగా ఉన్న వాళ్ళ ఛాతీ ఉద్వేగంతో ఎగిరి పడుతున్నాయి. ఎస్.ఐ. తన రివాల్వర్‌ను కేసులో పెట్టుకున్నాడు టేబిల్ ముందు కుర్చీలో కూర్చుని పెన్ తీసి నోట్ బుక్ మీద రాసుకుంటూ కర్కశంగా అన్నాడు. " రాస్కెల్స్, చెక్ పోస్ట్ను మాయజేసొచ్చేసినారు పోలీసోల్ని కూడా దాటెల్లి పోతర్రా ఎన్ని గుండెలు ఎదవ నాకొడుకుల్లారా? మీ దుమ్ము లేరేస్తా ఇవ్వాళ ... ఎక్కడ్నుంచొస్తున్నారేటి?"

ఆ ఇద్దర్లో ఎవ్వరూ మాట్లాడలేదు. ఇద్దరూ తలలు వంచుకుని నుంచొనున్నారు.

" వూ చెప్పండి!" గర్జించాడు ఎస్ ఐ . " బరంపురం" డ్రైవరు గొణిగాడు

." సరుకేటి?".... " సోప్ పౌడర్" . " గంజాయి గానున్నదేటి? .. నిజం చెప్పండి నీళ్ళు తాగించేసేగల్ను. చెర్మం తీయించగల్ను " .. "లేదు " ... " మరెందుకయితే పారేల్లి పోయొచ్చేసినారు?' 'డ్రైవరు మాట్లాడలేదు. యస్.ఐ. రెట్టించి అడిగాడు. డ్రైవరు ఇంకా మాట్లాడలేదు.

ఎస్.ఐ. మొహంలో తగ్గిపోయిన కోపం మళ్ళీ ప్రవేశించింది. " ఈల్లు చెప్పుతారే. లంజ కొడుకుల్లారా! మీకు దిమ్మలిరిగేలా బాడిచెయ్యాల్రా" అంటూ ఒక్క ఉదుటున లేచి విసవిసా వాళ్ల దగ్గరికి వచ్చాడు. చాచి పెట్టి డ్రైవరును ఒక్క లెంపకాయ కొట్టాడు. ఆ దెబ్బకు అతను తూల్తూ వెళ్ళి గది మూల పడ్డాడు. అతని నెత్తిన ఉన్న తిరపతి టోపీ ఎగిరి కిందపడింది వెండనే బారెడు జుట్టు, ముడి వూడి మొహం మీద పడింది!

ఎవడో కానిస్టేబిల్ " ఆడగుంట ఆడగుంట" అని అరిచాడు.

ఎస్.ఐ. మొఖంలో రంగులు మారాయి. రెండు మూడు క్షణాలు డ్రైవరు ముఖంలోకి తీక్షణంగా చూసాడు. చూసిచూసి చటుక్కున క్లీనరు వైపు తిరిగి అతని తల మీది టోపీని లాగి పారేశాడు.

రిబ్బను చుట్టి పడేసిన జుట్టు బయట పడింది! బిత్తర పోయాడు ఎస్.ఐ. నాలుగైదు క్షణాలు తర్వాత తేరుకుని అన్నాడు ఆశ్చర్యంగా. " అబ్బీ, మీరు ఆడగుంటలా?" ... " అవును" అన్నట్లు తలూపింది డ్రైవరు.

" మరయితే లోపల జాకెట్టు , చీరలున్నాయేటి?" ..." ఉన్నాయ్" ఎస్ ఐ. సంజ్ఞ చేయగా ఒక కానిస్టేబిల్ వాళ్ళ చేతుల్నించి బేడీలు తీసేశాడు. వాళ్ళిద్దరూ మెల్లిగా తమ పాంటూ చొక్కాలను తీసేశారు. పూర్తి స్త్రీ రూపాల్లో ప్రత్యక్షమయ్యారు!

తికమక పడుతున్న మొహంతో ఎస్.ఐ. వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. పదిక్షణాల తర్వాత అన్నాడు. " మరయితే మీకు డ్రైవింగు లైసెన్సులున్నాయేమిటి? " డ్రైవరు అంది: "లేవు" ఎస్.ఐ. ముఖంలోకి మళ్ళీ చిరాకు ప్రవేశించింది. "మరయితే జైల్లోకెల్లాలనుందేటి బండెక్కినావు, హైస్పీడ్ తోలినావు."

అంతవరకూ పైకి తన్నుకొస్తున్న దుఃఖాన్ని చీరె కొంగు అడ్డం పెట్టుకుని ఆపుకుంటూన్న డ్రైవరు, ఏడుపు గొంతుకతో ఆవేశంగా అంది- " అసలు సచ్చిపోవాలనే సూసినాము కాదా బాబూ, కానయితే ఆ ముదనష్టపు ఎదవలు సచ్చిపోనిచ్చినారు కాదు."

" అల్లెవరు?"

డ్రైవరు గొంతులో ఆవేశం రెట్టింపయింది."అల్లా, మాకు శని గొట్టెదవలు. రాచ్చసులు. మేమసలు ఇసాకపట్నం వోల్లం. ఆడోల్లనమ్ముకుని యాపారం చేసే వోల్లు, మమ్మల్ని అమ్మటానికి నిన్న సాయంత్రం ఇసాకపట్నం నుంచి సేతులు కాళ్ళు కట్టి పడేసి ఈ లారీలోనే బరంపురం తీసుకెళ్ళి పోయినారు. మామేం పాపం సేసుకున్నాము బాబు, ఒళ్ళు అమ్ముకోడానికి ? మాకు మావోల్లంతా ఉండి కూడా ఈ కర్మేటి బాబూ? ఈ అమ్మని చూడండి . ఈ అమ్మ ఇసుకూలు పంతులుగారి బొట్టెంట. ఆడెవడో ముదనష్టపు చచ్చినోడు, ఈ అమ్మ ఫ్రెండంట, సినిమాకు తీసికెల్తానని మాటల్చెప్పి తీసికొచ్చి, ఈ రాచ్చసుల కప్పజెప్పేసినాడు నన్నయితే, మా బాబు పిలుస్తున్నాడు రమ్మనమని ఆడెవడో అట్టుకొచ్చి లారీ

ఎక్కించేసినారు. బరంపురం తీసుకొచ్చేసినారు''

''ఎట్లా తప్పిచ్చుగొచ్చినరు?''

''అల్లు మమ్మల్ని గదిలో తాల్లతో కట్టేసి పడేసి యేసాలు మార్చుకొని, ఈ కాకీ బట్టలేసుకుని లారీలో సొవుపొడరెక్కించినారు. తరువాత తలుపు బయట గొల్లెంబెట్టి ఎల్లి పుల్లుగ తాగొచ్చినారు. మేమీ యేలకి కట్లు కొరికేసి తెంపీసుకుని తలుప్పక్క దాక్కుని అల్లురాగానే మీదపడి గొంతులు పిసికేసి పడేసినాము. తాల్లతో కట్టేసినాము. అల్ల బట్లు మాముచ్చుకుని, బిల్లు బుక్కు పుచ్చుకుని లారీ ఎక్కి పొచ్చేసినాము. ఈ టోపీలు కూడా అల్లయే''- డ్రైవరు హటాత్తుగా నోటికి కొంగు అడ్డం పెట్టుకుని. సన్నగా ఏడవడం మొదలు పెట్టింది.

నోరు తెరుచుకుని వింటున్న ఎస్.ఐ. కి. ఒంటిన రోమాలు నిక్కబొడుచుకోగా ఆదుర్దాగా అన్నాడు. ''అ పోటేరంగాల్లు సచ్చినారేటి?''.

హటాత్తుగా క్లీనరు నోరు విప్పింది. పౌరుషంగా అంది ''ఏమడిగారండి, ఇనస్పెక్టరుగారూ! మా మానం కన్నా వాళ్ళ ప్రాణం ముఖ్యమాండి అయినా వాళ్ళు చావలేదు లెండి.''

రొజుకొన్తున్న గొంతుతో ఎస్.ఐ. అన్నాడు; ''ఆహాహా, అది కాదమ్మా, అసరికేటయినాదని అడుగుతున్నా. సరయితే అమ్మా, ఇట్టగ బండి తోలటం తప్పని తెలీదా?''

డ్రైవరు ఏడుపు మానేసింది; '' అసలు మా బాబు లారీ వోనరు. సిన్నప్పుడే లారీ తోల్టం నేర్చుగున్నను సరే. ఇప్పుడు మేము చేసింది తప్పే. ఆడోల్లు అసలు ఇవే బల్లు తోలగూడదు సెక్‌పోస్టతన్ని మాయసెయ్యగూడదు. పోలీసోల్లతో పేచీ పడకూడదు. ఇయ్యన్నీ ఎంతుకు సేసినాము బాబు? మానవు మానవు కోసం గదా! మానవు పోయినాక అడదానికేటున్నాది బాబు? అంత కన్న సచ్చి పోటం మంచిది కాదా!... మాకు శిచ్చేసి మమ్మల్ని జైల్లో తోసెయ్యండి కాని. కాని. అ ముదనష్టపు సచ్చినోల్లను మాత్రం కత్తుల్తో, చీల్చి, చీల్చి పిస్తోల్తో, కాల్చి కాల్చి. '' క్రమంగా ఆవేశం పెరగ్గా డ్రైవరు భళ్ళుమని ఏడ్చేసింది!

ఎస్.ఐ. నాలుగైదు క్షణాలు తలవంచుకుని ఉండిపోయాడు. అన్నాడు;'' చెక్‌పోస్టు కాడెందుకు మాయజేసినరు?''

''సెక్‌పోస్టు కాద బాబు మామిద్దర్నీ ఆడోల్లమని పసిగట్టేసినాడు.'' .. ''సోంపేట ఎందుకాగలేదు? మా పోల్లు రచ్చించేవోళ్ళుగదా!''

హటాత్తుగా క్లీనరు కల్పించుకుని అంది; '' అ హడావిడిలో మేము ఎట్లాగోట్లా విశాఖపట్నంల్లో పడాలనుకున్నాము. తోచింది చేసాము. మమ్మల్ని రక్షించదలుచుకుంటే ఇప్పుడు రక్షించకూడదా?'' అని రెండు క్షణాలాగి, ఇంచుమించు ఏడుస్తున్న స్వరంతో గబగబా ముందుకు వచ్చి ఎస్.ఐ. చేతులు పట్టుకుని ఆమె అంది: ''ఇన్‌స్పెక్టర్‌గారూ! మాకు తల్లయినా తండ్రయినా మీరే. మమ్మల్ని రక్షించండి. మేమే పాపం ఎరగం. కనీసం ముందు మమ్మల్ని మా వాళ్ళతో కలపండి'' మరు క్షణంలో భళ్ళున ఏడ్చేసింది.

(ఆంధ్రసచిత్ర వారపత్రిక 4-7-79)

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★